



నెల్లూరులో ఆదివారం తెల్లవారుజామున భోగి మంట వేస్తున్న నగరవాసులు

ఊరూరా సంబరం!

చిన్నారులకు భోగిపండ్లతో దీవెన
కనుల పండువగా గోదా కల్యాణం
నేడు సంక్రాంతి పర్వదినం

● ఉత్సాహంగా భోగభాగ్యాల భోగి ● బంధుమిత్రులతో పల్లెలు కళకళ



కోవూరులో ఉత్సాహంగా సాగిన ఎడ్ల పందేలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 14 : భోగి పండుగను జిల్లావాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచే వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లు, ఇళ్ల ముందు మంటలు వేశారు. కార్యాలయాలు, ఇళ్లలోని పాత వస్తువులను భోగి మంటల్లో వేసి నూతన వస్తువులతో సంక్రాంతికి స్వాగతం పలికారు. మంటల కాంతికి వీధులన్నీ దగదగలాడాయి. ఉదయం మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది పండుగ శోభను తెచ్చారు. ఉదయం భోగి స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి తమ ఇష్టదైవాలకు పూజలు చేశారు. నాటుకోడి, దోశలను అల్పాహారంగా తీసుకున్నారు. బంధుమిత్రుల రాకతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. వివిధ రంగాల ప్రముఖులు, రాజకీయ నేతలు స్వగ్రా మాలకు చేరుకుని సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం భోగి భాగ్యాలు తమ వారసులకు అందాలని ఆకాంక్షిస్తూ ఐదేళ్లలోపు చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. ముత్తయిదువులు గొబ్బినోములకు శ్రీకారం చుట్టి బొమ్మల కొలువులు ఏర్పాటు చేసుకొని గొబ్బి గౌరమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు అన్ని వైష్ణవ ఆలయాల్లో గోదా కల్యాణాలు వేడుకగా జరిగాయి.

నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం గోదాదేవి (ఆండాళ్) అమ్మవారికి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం సేవలు జరిగాయి. సాయంత్రం (ఆండాళ్) గోదాదేవికి తల్పగిరి రంగనాథస్వామికి ఎదురుకోలు ఉత్సవం నయనానందకరంగా జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ మాలల మార్పిడి ఘట్టం మరింత ఆకట్టుకుంది. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి గోదాదేవకి కల్యాణం కనులపండువగా జరిగింది. ఇక పెంచలకోన క్షేత్రంలో గోదాదేవి క్షేత్రోత్సవం అట్టహాసంగా జరిగింది. సోమవారం సంక్రాంతి పండుగను జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. పొంగళ్లు పొంగించి పెద్దలకు నూతన వస్త్రాలు పెట్టి పూజలు చేయనున్నారు. సంక్రాంతి అంటే పతంగులు పండుగ. చిన్నా పెద్దా తేడా లేకుండా పతంగులు ఎగరవేయనున్నారు. సాయంత్రం బోడిగాడితోటలో పెద్దల పండుగ జరగనుండగా, నగర పాలక సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. తమ పూర్వీకుల సమాధులను కుటుంబ సభ్యులు అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.



నెల్లూరు : శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి గోదాదేవికి జరిగిన కల్యాణం



హైటెక్ హరిదాసండీ : లింగసముద్రంలో బైక్‌పై వచ్చిన హరిదాసుకు దానం చేస్తున్న బాలిక



కావలిలో పిల్లలపై భోగి పండ్లు పోస్తున్న పెద్దలు

పండుగ నాడూ పోరాటమే !

కొనసాగుతున్న అంగన్వాడీల ఆందోళన
భోగి మంటల్లో నోటీసుల ప్రతుల దహనం



నెల్లూరు : భోగిమంటల్లో నోటీసులను దహనం చేస్తున్న నేతలు

నెల్లూరు (వైద్యం), జనవరి 14 : ఊరూరా ప్రతి ఇంటా సంక్రాంతి సందడి నెలకొని ఉండగా, అంగన్వాడీలు మాత్రం తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని తేల్చి చెబుతున్నారు. తమకు అందజేసిన షోకాజ్ నోటీసుల ప్రతులను ఆదివారం ఉదయం అంగన్వాడీలు భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని ముత్తుకూరు గేటు సెంటర్‌లో సీఐటీయూ ఏర్పాటు చేసిన భోగి మంటల్లో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అనేక రూపాల్లో బెదిరింపు ధోరణులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఐదేళ్లకు ఒకసారి జీతాలు పెంచుతామని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. ఈ నిరసనలో భవననిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు సుధాకర్, సంపూర్ణమ్మ, రాజా, మురళీ తదితరులు పాల్గొన్నారు. కావలి, కందుకూరు తదితర ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

కావలిలో..



కందుకూరులో..

అంతుచిక్కని వ్యాధితో జీవాల మృతి

● ఆందోళనలో యజమానులు

ఉదయగిరి, జనవరి 14: మండలంలోని పలు గ్రామాల్లో అంతుచిక్కని వ్యాధితో గొర్రెలు మృతి చెందుతున్నాయని, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని యజమానులు వాపోతున్నారు. మండలంలోని కొండాయ పాళెం గ్రామంలో రవికి చెందిన 4 గొర్రెలు, తిరుపతయ్యకు చెందిన 3, వెంకటయ్యలకు సంబం ధించిన గొర్రెలు మూడు రోజుల్లో చనిపోయాయి. మేత మేయకపోవడం, నీరసించి మృత్యువాతపడుతున్నాయని యజమాను లు తెలిపారు. ఒక్కో గొర్రె రూ.15 వేలు విలువ చేస్తుందని, చనిపోతుండడంతో వేలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని, జీవాలపై ఆధారపడి జీవించే తమకు ఏమి చేయాలో దిక్కు తోచడం లేదని, వేలాది రూపాయల మందులు తెచ్చి వాడినా వ్యాధి నయం కావడంలేదని, వ్యాధి నిర్ధారణ చేయాల్సిన పశు సంవర్ధక శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీవాలకు చికిత్స అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కొండాయపాళెంలో మృతిచెందిన గొర్రె(ఫైల్)

చివరి దశకు ఓటర్ల జాబితా

● ముగిసిన క్లయిమ్స్ పరిష్కారం గడువు
● ఈనెల 22న ముసాయిదా ప్రచురణ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. స్పెషల్ సమ్మరీ రివిజన్-2023 ఓటర్ క్లయిమ్స్ పరిష్కారం గడువు ఈ నెల 12వ తేదీతో ముగిసింది. ఇక ఫైనల్ ఓటర్ల జాబితాను ప్రచురించడం మాత్రమే మిగిలింది. ఈ నెల 22న ఈ ముసాయిదాను ప్రచురించనున్నారు. గతేడాది అక్టోబరు 27న స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆరంభమవగా, డిసెంబరు 9వ తేదీ వరకు ఫారమ్-6, 7, 8 దరఖాస్తులను స్వీకరించారు. మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 26తో ఓటరు క్లయిమ్స్ పరిష్కరించి జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రచురించాల్సి ఉంది. అయితే దరఖాస్తులు భారీగా రావడంతో స్పెషల్ సమ్మరీ రివిజన్ గడువు ఎన్నికల సంఘం ఈ నెల 22కు పొడిగించింది. అక్టోబరు 27 నుంచి ఫారమ్-6 దరఖాస్తులు 62,696 వచ్చాయి. అందులో 53,777 ఆమోదించగా, 8,914 దరఖాస్తులను తిరస్కరించారు. అలాగే ఫారమ్-7 దరఖాస్తులు 63,888 రాగా, 54,686 ఆమోదించి, 8,610ల ను తిరస్కరించారు. ఈనెల 9వ తేదీ నాటికి మరో 592 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఫార మ్-8 దరఖాస్తులు 73,102రాగా, 68,859 ఆమోదించారు. 2,652 తిరస్కరించగా, 1591 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. గతేడాది ఏప్రిల్ 15 నుంచి జిల్లాలో భారీగా ఫారమ్-7 (ఓట్ల తొలగింపు) దరఖాస్తులు అందాయి. అక్టోబరు 26వ తేదీ నాటికి 1,37,844 దరఖాస్తులు రాగా, ఆ తరువాత నుంచి ప్రారంభమైన స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో మరో 63,888 దరఖాస్తులు వచ్చాయి. ఇంత భారీస్థాయిలో ఫారమ్-7 దరఖాస్తులు అందడంతో ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగా అధికారపార్టీ నాయకుల తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు కుట్ర లు చేస్తున్నారంటూ టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో 32 వేల కుపైగా దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంటే వీరంతా బతికి ఉన్నా, స్థానికంగా ఉన్నప్పటికీ వారి ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు అందాయి. ఇక ప్రతిపక్షాలు ఆరోపించినట్లుగానే అధికార పార్టీకి చెందిన కొందరు నేతల పేర్లతో భారీగా దరఖాస్తులు అందాయి. ఇలా ఉద్దేశపూర్వకంగా ఫారమ్-7 దరఖాస్తులు ఇచ్చిన ఏఎస్‌పేట, చేజర్ల మండలాల్లో కేసులు నమోదు చేశారు. ఇక ఈ నెల 22వ తేదీ న తుది జాబితాను ప్రచురిస్తే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఈ నెల 9నాటికి జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	1,12,185	1,14,382	24	2,26,591
కావలి	1,14,919	1,19,088	28	2,34,035
ఆత్మకూరు	1,04,702	1,04,085	8	2,12,755
కోవూరు	1,26,194	1,34,708	20	2,60,922
నెల్లూరు సిటీ	1,16,033	1,21,354	71	2,37,458
నెల్లూరురూరల్	1,30,010	1,37,022	26	2,67,058
సర్వేపల్లి	1,11,463	1,17,578	30	2,29,071
ఉదయగిరి	1,18,411	1,20,035	13	2,38,459
మొత్తం	9,33,917	9,72,212	220	19,06,349

మనుబోలులో ఇరువర్గాల దాడులు

● ఆరుగురికి గాయాలు


కంటికి గాయమైన హరికృష్ణ


దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్

మనుబోలు, జనవరి 14: భోగిపండుగ సందర్భంగా మనుబోలులో శనివారం అర్ధ రాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన దాడుల లో ఆరుగురు గాయాల పాలయ్యారు. పోలీ సుల కథనం మేరకు... స్థానిక శివాలయం వీధికి చెందిన శ్రీకాంత్, వెంకటేశ్వర్లుతో పాటు మరి కొంతమంది యువకులు భోగి మంటలు వేసేందుకు కట్టెలు కోసం చాకలి వీధి సమీపంలో తిరుగుతున్నారు. ఓ పాడు బడిన ఇంట్లో పూలకుండీలు బయట ఉండ గా శ్రీకాంత్ వాటిని పగులగొట్టాడు. దీనిని గుర్తించిన హరికృష్ణ కట్టెలు తీసుకెళ్ళాలి గాని, కుండీలతో ఏం పని అని గదమాయించాడు. దీంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం తలెత్తగా సర్దుబాటుతో వెళ్ళిపోయారు. కొద్దిసేపటి తరువాత హరికృష్ణతో పాటు కొంతమంది యువకులు దేవాంగుల వీధిలో ఉన్న రామమందిరం వద్ద భోగిమంటలు వేస్తుండగా ఆ వీధికి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు రాగా వివాదం రేగింది. దీంతో హరికృష్ణ చేతిలో ఉన్న పారతో శ్రీకాంత్ తలపై కొట్టగా శ్రీకాంత్ తన చేతిలో ఉన్న కడియంతో హరికృష్ణపై దాడిచేశాడు. దీంతో హరికృష్ణ వర్గీయులు రాగా, శివాలయం వీధినుంచి శ్రీకాంత్ వర్గీయులు వచ్చి దాడులు చేసుకున్నారు. ఈ దాడులలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, హరికృష్ణ, కన్నా వెంకటేశ్వర్లు, యారాశి కిషోర్‌కుమార్, పముజుల సునీల్, బ్రహ్మయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ డ్రైవర్‌కి తీవ్రగాయాలు


గాయపడిన డ్రైవర్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు

బిట్రగుంట, జనవరి 14: బోగోలు మండలం ముంగమూరు క్రాస్‌రోడ్డు వద్ద ట్రాలీలారీ, బొగ్గు లారీ ఆదివారం సాయంత్రం ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో బొగ్గులారీ డ్రైవర్‌కి గాయాలయ్యాయి. హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌ప్రసాద్ కథనం మేరకు, కృష్ణపట్నం పోర్టు నుంచి తెలంగాణకు బొగ్గులోడుతో లారీ వెళ తోంది. కావలి వైపు వెళుతున్న ట్రాలీ లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న బొగ్గు లారీ ఢీకొంది. దీంతో డ్రైవర్‌కు రెండు తీవ్రగాయా లు అయ్యాయి. గాయపడిన లారీ డ్రైవర్ గడ్డం అనంతరావును 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు ట్రాలీ లారీడ్రైవరును అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి


సాయి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

సంగం, జనవరి 14: రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ముంబాయి జాతీయ రహదారిలో సిద్దీపురం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సిద్దీపురం దళితవాడకు చెందిన బండి సాయి (18) మోటారుబైక్‌పై బుచ్చిరెడ్డి పాళెం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో సాయి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకుని సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

● పందెపురాయుళ్ల అరెస్ట్, నగదు, కోళ్లు స్వాధీనం


మనుబోలు : అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లతో పోలీసులు


కావలి రూరల్ : పోలీసుల అదుపులో ఉన్న పందెం రాయుళ్లు

సంగం, జనవరి 14: సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే పందేలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి నిర్వాహకులను, కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. సంగం మండలంలోని మర్రిపాడు అటవీ ప్రాంతంలో కోడి పందెం స్థావరంపై ఆదివారం సంగం ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో దాడులు చేశారు. ఈ దాడుల్లో 14 మంది పందెంరాయుళ్లతోపాటు 13 పందెం కోళ్లు, రూ. 18,880 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

● **ఉదయగిరి రూరల్ :** మండలంలోని వెంకట్రావుపల్లి, ఆర్లపడియ గ్రామాల సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ దాడుల్లో 3 కోళ్లు, 11 మంది పందెపురాయుళ్లతోపాటు రూ.11,410ల నగదు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

● **మనుబోలు :** కట్టువపల్లిలోని రొయ్యల గుంతల వద్ద ఆదివారం కోడిపందెం స్థావరంపై ఎస్‌ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సివిల్ డ్రస్‌లో వెళ్ళి దాడులు నిర్వహించారు. ఏడుగురు పందెంరాయుళ్ళను అదుపులోకి తీసుకున్నారు. వారివద్దనున్న నాలుగు కోళ్ళు, రూ. 14,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● **కావలి రూరల్ :** కావలి మండలం చలంచర్ల పంచాయతీ పెద్దారం అటవీ ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ సీఐ శ్రీనివాసరావు, తన సిబ్బందితో నిర్వహించిన దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ. 5,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● **సీతారామపురం :** మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ అనూష తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద 4 కోళ్లు, రూ. 4270 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	118
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5976
వెండి కిలో ధర	రూ. 73,900
వెండి ఒక గ్రాము	రూ. 75.90


బుచ్చిలో జోరుగా కోడి పందేలు

బుచ్చిరెడ్డిపాళెం : భోగి పండుగ సందర్భంగా బుచ్చి మండల పరిధిలోని పెన్నా తీరప్రాంతంలో ఆదివారం కోడిపందేలు జోరుగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రూ. 5లక్షలకుపైగా డబ్బులు పెట్టి పందేలు కాశారు.డేగ, నెమిలి, కాకి, పొడ, కక్కిరి, మైలు తదితర రకాల కోళ్లను బరిలో దింపారు. రెండు వైపుల నుంచి బరిలో దిగే పందెం కోళ్ల కాళ్లకు కత్తులు చుట్టారు. బరిలో మొత్తం 11 జోడీలు (22 పందెంకోళ్లు) మధ్య హోరా హోరీగా పోరు సాగింది. పందెం నిర్వాహకులు ముందుగా ఓ నాయకుడి ద్వారా పోలీసుల తరపున భరోసా తీసుకుని పందేలు నిర్వహించారు. సాయంత్రం మూడు గంటలకు పోలీసులు వస్తున్నారని పుకార్లు రావడంతో ఎవరివారు పరారయ్యారు.

మా నగదు ఎప్పుడు చెల్లిస్తారో!?

ఆర్థిక చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఎదురుచూపులు



ఉపాధ్యాయుల ఖాతాల్లో కోట్ల రూపాయల నగదు ఉన్నా వారి అవసరాలు మాత్రం తీరడం లేదు. అత్యవసర పరిస్థితులకు, పిల్లల చదువులు, పెళ్లిళ్లకు, గృహ నిర్మాణాల కోసం ఇలా ఎన్నో అవసరాలకు వారికి రావాల్సిన నగదుకు దరఖాస్తు చేసుకున్నా భవిష్యనిధి నుంచి కానీ, సంపాదిత సెలవుల నుంచి కానీ సకాలంలో ప్రభుత్వం చెల్లించిన దాఖలాలు లేవు. అనారోగ్యం దృష్ట్యా పెట్టుకున్న వైద్య ఖర్చులను కూడా తిరిగి చెల్లించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుండటంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తాము దాచుకున్న నగదును ఇచ్చేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరు (విద్య), జనవరి 14 : ఉపాధ్యాయ, ఉద్యోగులు వారి అవసరాల కోసం దాచుకున్న సొమ్ము కూడా తీసుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. కుటుంబ అవసరాల కోసం, అత్యవసర పరిస్థితుల కోసం నగదు తీసుకుందామని దరఖాస్తు చేసుకున్నా సకాలంలో ఇవ్వక పోవడంతో వీరంతా తీవ్ర నిరాసలో ఉన్నారు. భవిష్యనిధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు ఉపాధ్యాయులకు నెలలు గడుస్తున్నా నేటికీ వారికి లోన్ మంజూరు చేయకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. పీఎఫ్ లోన్‌లతోపాటు ఫైనల్ పేమెంట్లు కూడా సకాలంలో వచ్చే పరిస్థితులు లేవని విమర్శిస్తున్నారు. తమ ఖాతాల్లో దాచుకున్న సంపాదిత సెలవులను నగదుగా మార్చుకునేందుకు వీలు ఉన్నందున పలువురు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నా నేటికీ వీటిని చెల్లించిన పరిస్థితులే లేవు. అలాగే ప్రతి నెలా ఉపాధ్యాయులు వేతనాల నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం వందలాది రూపాయలు ప్రభుత్వం మినహాయిస్తుంది. దీనికి మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం అమల్లో ఉంది. ఉపాధ్యాయులు వైద్యం చేయించుకునేందుకు వారికి అయిన ఖర్చు మొత్తానికి రీఎంబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నా వీటిని కూడా చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోవడంతో ఏమి చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

● **ఆర్థిక బకాయిలెన్నో..**

ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం ఎన్నో ఆర్థిక బకాయిలను చెల్లించాల్సి ఉందని సంఘాలు చెపుతున్నాయి. పీఎఫ్‌లోన్లు, క్లోజర్స్‌తో పాటు ఏపీజీఎల్‌ఐ లోన్లు వెంటనే మంజూరు చేయాలంటున్నారు. అలాగే డీఏ, పీఆర్‌సీ బకాయిలు, సరెండర్ లీవ్, ఎన్ క్యాష్‌మెంట్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన పెన్షన్ బకాయిలు, మెడికల్ బిల్లులు, బకాయి ఉన్న రెండు డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దుతో పాటు పీఆర్సీ, వేతన బకాయిలు ఇలా అన్నింటికీ పరిష్కార మార్గం దొరుకుతుందని భావించి మద్దతు తెలిపామని, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు సాధ్యం కాదని తేల్చి చెప్పడం బాధాకరమంటున్నారు.



ప్రభుత్వ వైఖరి గర్హనీయం

ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన బకాయిల్లో ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరి గర్హనీయం. పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి నెలల తరబడిగా చెల్లింపులు జరగడం లేదు. సరెండర్ లీవ్ బకాయిలు రెండేళ్లుగా చెల్లించిన పాపాన పోలేదు. డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు చెల్లింపులు లేవు. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్న సీఎం సంక్షేమ పథకాలను అమలు చేసే ఉద్యోగులకు అరియర్స్ బటన్ నొక్కకపోవడం బాధాకరం. తమకు రావల్సిన కోట్లాది రూపాయలను ప్రభుత్వం విడుదల చేయకుండా తమ జీవితాలతో ఆటలాడుకోవడం ఆవేదన కలిగిస్తోంది.

- మాసా ప్రసాద్, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆర్థిక చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న నెలలోపే నగదు చెల్లించాలి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. త మ అవసరాల కోసం నగదు వస్తుందన్న ఆశతో ఎప్పుడు తమ ఖాతాల్లో నగదు జమ అవుతుందా అని ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని వింత సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులతో ఉపాధ్యాయులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలు తొలగించి వారికి అందాల్సిన ఆర్థిక బకాయిలను వెం టనే విడుదల చేయాలి. లేని పక్షంలో తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాము.

- జీవీ చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

టీచర్లపై అప్రజాస్వామిక విధానాలు అమలు

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు (విద్య), జనవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై అప్రజాస్వామిక విధానాలను అమలు చేస్తోందని యూటీఎఫ్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మాగుంటలేఅవుట్ లో ఉన్న యూటీఎఫ్ జిల్లా కార్యాలయం ఎదుట ప్రభుత్వ వైఖరిని, అప్రజాస్వామిక విధానాన్ని ఖండిస్తూ భోగిమంటలో ప్లేకార్డ్స్ దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులకు అనేక వాగ్దానాలు చేసిందన్నారు. నాలుగున్నరేళ్ల తర్వాత మీరిచ్చిన వాగ్దానాలు నెరవేర్చమని అడిగితే నిరంకుశంగా వ్యవహరిస్తూ ఉద్యమాలను అణిచివేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా ఇవ్వాల్సిన ఆర్థిక అవసరాలను కూడా చెల్లించకపోగా కనీసం జీతాలు కూడా సమయానికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ.అచ్చయ్య, కోశాధికారి ఏ.మురళీధర్‌రావు, కార్యదర్శి ఎస్.మధుసూదన్‌రావు, నేతలు వెండి శీనయ్య, రియాజ్, సుబ్రహ్మణ్యం, సులేమాన్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కులమతాలకు అతీతంగా తరలిరండి

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 14 : విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ కోరారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. ఈ క్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. విజయవాడకే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఈ విగ్రహం నిలవనుందని చెప్పారు. అక్కడ అంబేడ్కర్ స్మృతి వనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశారన్నారు. ఆయన జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కైలైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి సదుపాయాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ రమేష్, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి క్షేత్రోత్సవం


గోదాదేవి క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాపూరు (డక్కిలి) జనవరి 14 : పెంచలకోనలో ఆదివారం గోదాదేవి క్షేత్రోత్సవం వైభవంగా జరిగింది. అంజనేయస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవం, అనంతరం గోనుపల్లి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా, జిల్లా అడిషనల్ ఎస్పీ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు.

గోవుల ప్రేమికుడాయన!

● వాటి ఆకలి తీర్చాకే వ్యాపార లావాదేవీలు


గోమాత ఆకలి తీరుస్తూ..


గురుస్వామి రాజా

కల్మషం లేని గోమాతల ఆకలి తీర్చడమే ఆయన ధ్యేయం. ప్రతి రోజు తన దుకాణం తలుపులు తెరవక ముందే ఆయన అందించే ఆహారం కోసం గోమాతలు ఎదురుచూ స్తుంటాయి. గోమాతలకు ఆహారం అందించిన తర్వాతే వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తారాయన. ఉదయగిరిలోని శ్రీ లక్ష్మీ స్వీట్‌స్టాల్ యజమాని గురుస్వామి రాజా కుటుంబం నాలుగు దశాబ్దాలుగా వ్యాపారం నిర్వహిస్తోంది. మూగజీవాలంటే రాజాకు అమితమైన ప్రేమ. ప్రతిరోజు ఉదయాన్నే దుకా ణం ఎదుట ఆహారం కోసం వేచి ఉన్న గోమాతలకు ఆహారం అందించి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాతే వారి వ్యాపార లావాదేవీలు ప్రారంభిస్తారు. ఆహారం కోసం దుకాణం వద్దకు వచ్చే గోమాతలకు, ఇతర మూగ జీవాలకు ఆహారం అందిస్తూ మూగజీవాలపై తన ప్రేమను చాటుకొంటున్నారు. ఈ సందర్భంగా గురుస్వామి రాజా మాట్లాడుతూ గోమాతలంటే నాకెంతో ఇష్టమని, వాటికి ఆహారం అందించిన తరువాతే తన వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తానని చెప్పారు. ప్రతి ఒక్కరు మూగజీవాలపై ప్రేమాభినం చూపాలని కోరారు.

- ఉదయగిరి రూరల్

మినీ లారీ, మోటారు బైక్ ఢీ

● ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 14: మినీ లారీ (డీసీఎం), మోటార్‌బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తెడ్డు పాడు గ్రామ సమీపంలోని పిల్లాపేరు వాగు వద్ద ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వరికుంటపాడు మండలం దక్కునూరు గ్రామానికి చెందిన ఈ వెం గయ్య (60), మధు తండ్రీకొడుకులు. పని నిమిత్తం మోటార్‌బైక్‌పై నర్రవాడకు వెళ్తూ పిల్లా పేరు వాగు వద్ద ముందు వెళుతున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో వెంగయ్య మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

కోవూరులో ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు


ప్రథమస్థానం సాధించిన ఎడ్ల విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఐ శ్రీనివాసరావు తదితరులు

కోవూరు, జనవరి14 : సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు, పందెం అభిమానులు పోటీలను తిలకించారు. ఈ పోటీతో కోవూరు - యల్లాయపాళెం రోడ్డు జనంతో నిండిపోయింది. రోడ్డుకు ఇరువైపులా యువకులు, రైతులు ఆనందోత్సాహాలతో పరుగు పందేల్లో పాల్గొన్నారు. నిర్ణీత దూరాన్ని ఎడ్ల బండిని వేగంగా లాక్కువెళ్లే సమయాన్ని నిర్వాహకులు స్టాప్ వాచ్ సహాయంతో లెక్కకడతారు. తక్కువ సమయంలో నిర్ణీత ప్రదేశానికి వెళ్లివచ్చిన ఎడ్లను విజేతలుగా నిర్ణయిస్తారు.

● **విజేతగా కోవూరు ఎడ్లు**

ఈ పోటీల్లో కోవూరుకి చెందిన మద్దెల కిరణ్‌కు చెందిన చెన్నకేశవ ఎడ్లు ప్రథమ స్థానాన్ని సాధించాయి. నారపరెడ్డి రాధాకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సోమశేఖర రెడ్డి విజేతకు రూ.15,116 నగదు, వెండి కప్పును బహూకరించారు. ద్వితీయ బహుమతిని ఇందుకూరుపేట మండల పరిధిలోని గంగపట్నంకి చెందిన నిఖిల్ (చాముండేశ్వరి) ఎడ్లు సాధించాయి. విజేతకు దండి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సుబ్బమ్మ రూ.13,116 అందించారు. పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు మారుతీ నాగార్జున వెండి కప్పును అందచేశారు. మూడవ బహుమతిని పాటూరుకి చెందిన ఆంజనేయ ఎడ్లు సాధించాయి. బహుమతిని కోవూరుకు చెందిన గాదిరాజు భాస్కర్‌రావు, జీవనకృష్ణలు అందించారు. నాల్గవ బహుమతిని బాపట్ల జిల్లా కంకట్లపాళెంకి చెందిన అభయాంజనేయస్వామి ఎడ్లు సాధించాయి.బహుమతిని కోవూరుకు చెందిన శిగినం ఆదిశేషయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఆదినారాయణ అందించారు. వెండి కప్పును సాయం వరదయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాయికుమార్ అందించారు. ఐదో బహుమతిని కోవూరుకు చెందిన వీరాంజనేయస్వామి ఎడ్లు సాధించాయి.బహుమతిని కోవూరుకు చెందిన గడ్డం చిన వెంగళరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వేణు అందించారు. వెండి కప్పును కైలాసం పద్మావతమ్మ జ్ఞాపకార్థ ఆమె భర్త గోపాలరెడ్డి అందించారు. కోవూరు ఎడ్ల బండ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్ని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన బాబురెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐ శ్రీనివాసరావు , ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ పోటీలకు సమన్వయకర్తలుగా పొబ్బారెడ్డి మల్లికార్జునరెడ్డి, నరేంద్రరెడ్డి, తాటిపర్తి విజయకుమార్, రమణారెడ్డి,దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, బాబు తదితరులు వ్యవహరించారు.

19న విజయవాడకు తరలిరండి

నెల్లూరు (విద్య) : విజయవాడలో ఈనెల 19న జరిగే 125 అడుగుల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా యువత, క్రీడాకారులు తరలిరావాలని ఏపీ రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ పిలుపునిచ్చారు.ఆదివారం నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారు మూడి విక్టర్ ప్రసాద్‌ను నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలసి ఆయను శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

14 మద్యం సీసాల స్వాధీనం

సీతారామపురం, జనవరి 14 : మండలంలోని బోడసిద్దాయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై దాడి నిర్వహించి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అనూష ఆదివారం తెలిపారు. నిర్వాహకున్ని అదుపులోకి తీసుకున్నామన్నారు.


పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న పూడిపర్తి గ్రామస్థులు

పూడిపర్తిలో యువకుల తీరుపై ఆగ్రహం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వెంకటాచలం : పూడిపర్తి గ్రామంలో కొందరు యువకుల వ్యవహారశైలి గ్రామస్థుల్లో ఆగ్రహం తెప్పించింది. జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, మహిళలను ఈవ్‌టీజింగ్ చేయడం, బెల్టు దుకాణాలలో మద్యం సేవించి గ్రామస్థులపై గొడవలకు దిగి దాడులకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి గ్రామంలో భోగి మంటలు వేసుకుంటుండగా కొందరు యువకులు పూటుగా మద్యం సేవించి గొడవకు దిగారని, అడ్డువచ్చిన మహిళలను అసభ్యకరంగా దూషించారని ఆరోపిస్తున్నారు. యువకుల ఆగడాలు శ్రుతిమించడంతో గ్రామస్థులంతా ఏకమై ఆదివారం రాత్రి వెంకటాచలం పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కారకులైన యువకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

గ్రావెల్‌తో సీసీ రోడ్డు గుంతల పూడ్చివేత

కావలి,జనవరి14: స్థానిక వైకుంఠపురంలోని అన్నపుగుంటవీధిలో ఉన్న సీసీ రోడ్డుపైకి డ్రైనేజీ నీరు చేరడంతో అస్తవ్యస్తంగా మారింది. సంక్రాంతి రోజున వైకుంఠపురంలో ఉన్న హిందూ శ్మశాన వాటికకు సోమవారం ప్రజలు వెళ్లి వారి పెద్దల సమాధులకు పూజలు చేస్తారు. అయితే సమాధులు వద్దకు వెళ్లే వారంతా ఆ మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో అక్కడ రోడ్డుపై నిలిచిన మురుగు నీరు కనిపించకుండా సీసీ రోడ్డుపై గ్రావెల్ తోలి కప్పారు. దీన్ని చూసి ప్రజలు చిత్రం భళారే చిత్రం... అని అనుకుంటున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అభివృద్ధి చేసే నాయకులకే మద్దతు

వరికుంటపాడు, జనవరి 14: ఉదయగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకులకే రానున్న ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని మాజీ మంత్రి మాదాల జానకిరాం అనుచరులు ప్రకటించారు. ఆదివారం వరికుంటపాడులో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో నిర్వాహకులు గొడుగులూరి మాలకొండ్రాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పాటుపడే పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో మాదాల విగ్రహాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొండాపురం మాజీ జడ్పీటీసీ దామా మహేష్ మాట్లాడుతూ ట్రస్టును సైతం ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణను వారం రోజుల్లో ప్రకటిస్తామన్నారు. తొలుత సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మద్దసాని వెంకటేశ్వరరావు, మాదాల రామచంద్ర, వడ్లమూడి నాగేంద్ర, వీర్నపాటి రామచంద్రమూర్తి, మాదాల తిమ్మయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొబ్బూరి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి చప్పర ఉత్సవం


సంగమేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంగం, జనవరి 14: మండల కేంద్రమైన సంగంలో భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం సంగమేశ్వరస్వామి చప్పర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను చప్పరలో ఉంచి పూలతో అలంకరించారు. అనంతరం సంగం పురవీధులో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదములు అందచేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

కలువాయి, జనవరి 14: భోగి పండుగ సందర్భంగా కలువాయి సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కలువాయికి చెందిన కామిశెట్టి వెంకటేశ్వర్లు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నరసయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్రిముఖ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



సీతారామపురం, జనవరి 14: మండలంలోని సిద్దేశ్వరంలో ఘటిక సిద్దేశ్వర ఆలయంలో ఇష్టకామేశ్వరి, భైరవకోనలోని త్రిముఖ దుర్గాదేవికి ఆదివారం భోగి పళ్లతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటిక సిద్దేశ్వర ఆలయ అర్చకులు సిద్దయ్య, కాశయ్య మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా సిద్దేశ్వరునికి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

ఆటల పోటీల ప్రారంభం

ఉదయగిరి రూరల్ : కృష్ణారెడ్డిపల్లిలో ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో క్రీడా పోటీలను సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య ప్రారంభించారు. ఈ పోటీలను కొండా రాజారెడ్డి, దేవసాని సుధాకర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి, కల్లూరి రవీంద్రారెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

యూటీఎఫ్ నేతల నిరసన

ఏఎస్ పేట, జనవరి 14: ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా మాట తప్పినందుకు ఆదివారం ఏఎస్ పేటలో యూటీఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భోగి మంటలలో ప్రభుత్వ హామీ పత్రాలను వేసి దహనం చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి, అప్రజాస్వామ్య విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


కావలి : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కావ్య కృష్ణారెడ్డి

కావలి, జనవరి14: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని టీడీపీ నేత కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని ఇందిరమ్మ కాలనీలో యువత నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతోపాటు శరీర దారుఢ్యానికి, మనసును నియంత్రించుకోవటానికి క్రీడలు చాలా అవసరమన్నారు. క్రీడల ప్రోత్సాహానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.

క్రీడాభివృద్ధికి సహకారం

బిట్రగుంట: బిట్రగుంట ఫుట్‌బాల్ క్రీడాకారులకు దేశంలోనే గుర్తింపు ఉందని, స్థానిక క్రీడాకారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ సహకారం ఉంటుందని ట్రస్టు వ్యవస్థాపకుడు పసుపులేటి. సుధాకర్ అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని రైల్వే క్రీడా మైదానంలో యంగ్‌లైన్స్ కమిటీ ఆధ్వర్యంలో లెజెండ్స్ ఫుట్‌బాల్ కప్ పోటీలు ఆదివారం జరిగాయి. క్రీడా ఉపాధ్యాయులు చౌడప్ప, లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఒక్కరోజు జరిగిన పోటీలో నాలుగు జట్లు తలపడ్డాయి. చెన్నై జట్టు విన్నర్‌గా నిలిచింది. సాగర్ సెవెన్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు బహుమతులు అందచేశారు.

యువత ఆధ్వర్యంలో మీట్ విత్ ద లీడర్స్


వేదికపై ఇంటూరి నాగేశ్వరరావు, దివి శివరాం, కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కందుకూరు : మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం మీట్ విత్ ద లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీఎస్ఆర్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల నుంచి బయటకు వెళ్లి వారంతా తమ గ్రామాల అభివృద్ధి, సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. మహదేవపురం గ్రామం మొదటి నుంచి టీడీపీకి కంచుకోట అని, రాబోయే ఎన్నికల్లో యువత నడుంబిగించి పార్టీ గెలుపుకోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, గుళ్లా సుధాకర్, చిట్టా హరికృష్ణ, చిట్టా బాబూరావు, ఓరుగంటి రమణయ్య, ఓరుగంటి శేషారావు, ముప్పరాజు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

కావలిటౌన్ : సమ్మెలో భాగంగా ఆదివారం ఉదయం అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు మాట్లాడుతూ సంక్రాంతి కూడా చేసుకోకుండా తమను రోడ్లపాలు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు రఘురావమ్మ, సుభాషిణీ, విజయలత, వజ్రమ్మ, బిందు, సీఐటీయు నేతలు పెంచలయ్య, మధుసూదనరావు, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : అంగన్‌వాడీలు ఆదివారం ఎస్మా కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. స్థానిక అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఉన్న శిబిరం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా శిబిరం వద్ద ముగ్గులు వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభావతి, కృష్ణవేణి, శశికళ, నిర్మల, రాజేశ్వరి, సుభాషిణి, సుజాత, సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవోల ప్రతులు దహనం

కావలి : వైసీపీ తెచ్చిన చీకటి జీవోలను భోగి మంటలో వేసి ఆదివారం టీడీపీ కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను వీధులలోకి తీసుకు వచ్చి ఇబ్బందులు పెట్టారన్నారు. రాష్ట్ర భవిస్యత్తు కోసం చంద్రబాబుని గెలిపించుకోవాల్సిన బాధ్య త మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మన్నవ రవిచంద్ర, గుత్తి కొండ కిషోర్, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కానుకలు ఇవ్వకపోవడంపై ధర్నా

బిట్రగుంట : పేదలకు పండుగ కానుకలు ఇవ్వకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. బోగోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన, మైనార్టీలు ఆదివారం ధర్నా చేశారు. పండుగలకు కానుకలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్యోతి రాఘవులు, నాటకరాణి వెంకటాద్రి, పీ ఫిలిప్, దుగ్గిరాల తిరువళ్వారు, మల్లికార్జున, రఫ్రారాల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు సామగ్రి పంపిణీ

కందుకూరు : స్థానిక కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు భారత యువ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వస్తు సామగ్రి అందచేశారు. రూ. 54,700 విలువ చేసే కుర్చీలు, వాటర్ డిస్పెన్సర్, నిత్యావసర వస్తువులు, పిల్లలకు స్నాక్స్ అందించినట్లు ఆర్గనైజర్ బెల్లం మనోజర్ తెలిపారు. కార్యక్రమంలో పీ శవకుమార్, టీ పృథ్వీరాజ్, డీ ప్రవీణ్, పీ సాయి తరుణ్, సంగ గోవర్ధన్, దుంప విష్ణు, పాఠశాల కరస్పాండెంట్ ఎస్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు

కందుకూరు: స్థానిక రెవెన్యూ కాలనీలోని కోదండరామాలయంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గుంటూరి శ్రీనివాసమూర్తి స్వామి వారికి విశేష అలంకారం, పూజాదికాలు నిర్వ హించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, భవ్యరామ మందిర చిత్రపటాన్ని భక్తులకు అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మన్నేపలల్లి వరప్రసాదరావు, నాయకులు జమ్మలమడక సుబ్రహ్మణ్యం, దత్తు జోగేంద్ర పాల్గొన్నారు.

జలదంకిలో రక్తదాన శిబిరం

జలదంకి : ప్రతి ఏటా భోగిరోజున జలదంకి జెమ్స్ ఐకేర్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదానం శిబిరాన్ని ఆదివారం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఐకేర్ మిషన్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 24మంది యువకులు రక్తదానం చేశారు. . కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి వాకా హజరత్‌రెడ్డి, పవన్, వేణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు మిఠాయిల పంపిణీ

కొండాపురం : మండలంలోని కొమ్మి గ్రామంలో కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 52 ముస్లిం కుటుంబాలకు ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ చెరుకూరు వెంకటాద్రి ఆదివారం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు తావు లేకుండా కోడె చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సీహెచ్ రమణయ్య, యోనా, టీడీపీ నాయకులు సీహెచ్.నవీన్, సీహెచ్. శేషయ్య, షేక్ ఖాసిం, రామమూర్తి, బాదుల్లా పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లింగసముద్రం : మండలంలోని అన్నెబోయినపల్లిలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పొలాల్లో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని ఎస్ఐ ఎం బాజీబాబు అదుపులోకి తీసుకొని, వారి నుంచి మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేలటూరులో వికసిత్ భారత్

ఉదయగిరి రూరల్, జనవరి 14: మండలంలోని నేలటూరు గ్రామ సచివాలయ పరిధిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజలు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

శకునాలపల్లిలో వీధి దీపాల ఏర్పాటు

ఉదయగిరి రూరల్, జనవరి 14: మండలంలోని శకునాలపల్లి పంచాయతీలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. పంచాయతీలోని కుర్రపల్లి, యర్రబల్లిగడ్డ, బోడబండ, శకునాలపల్లి గ్రామాలతోపాటు ఎస్సీ, బీసీ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి






ఘనంగా భోగి పండ్ల వేడుక

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 14 : సింహపురి సంక్రాంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ బొమ్మ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో చిన్నారులకు భోగి పండ్లు వేడుక కనుల పండువగా జరిగింది. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి : నారాయణ


చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 14: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేసింది టీడీపీ ప్రభుత్వమేనని, రానున్న టీడీపీ ప్రభుత్వంలో పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 50వ డివిజన్ సంతపేట బుజ్జమ్మరేవులో మాజీ మంత్రి కుటుంబ సమేతంగా ఆదివారం పర్యటించారు. డివిజన్ ఇన్‌చార్జ్ కప్పిర శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. బుజ్జమ్మరేవు చర్చి, పినాకిని పార్కుల వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 200 మంది పేద విద్యార్థులకు మూడేసి జతల దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ది పేరెంట్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(విద్య), జనవరి 14 : ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 2024వ సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ప్రజారోగ్య, పంచాయితీరాజ్, పురపాలకశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈవీఎం శరత్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి, నాయకులు డీ.కమలాకర్, మహేష్ కుమార్, శ్రీనివాస్, సురేష్, రాజశేఖర్‌రావు, బాలిరెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.

నేడు మకర జ్యోతి దర్శనం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 14 : శబరిమలైలో జ్యోతి దర్శనం సందర్భంగా నగరంలోని అయ్యప్పగుడిలో సోమవారం మకరజ్యోతి దర్శనం ఏర్పాటు చేశారు. ఆదివారం అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. మకరజ్యోతి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.





కనుల పండువగా గోదా కల్యాణం


వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా కల్యాణం


సంక్రాంతి సంబరాల్లో వాకర్స్

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 14 : సంక్రాంతి సంబరాల్లో తొలి పండుగ భోగిని ఆదివారం నగర ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి నుంచే ఇంటింటా భోగి మంటలు వేశారు. రాజకీయ పార్టీలు తమ పార్టీ కార్యాలయాలు వద్ద భోగి మంటలు వేశారు. ప్రతిపక్షాలు, సమ్మెలో ఉన్న ఉద్యోగులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ భోగి మంటలు వేశారు. స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు తమ ఆశయాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కొన్ని సంఘాలు సంప్రదాయ క్రీడా పోటీలు, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తూ సంబరాలు చేశారు.

- మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం కమనీయంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉభయకర్తలు, ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ దాసరి చంద్రశేఖర్‌రావులు పర్యవేక్షించారు.
- అయ్యప్పగుడిలోని గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఉదయం గోదాదేవికి అభిషేకాలు, కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.
- నగరంలోని మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో గోదాదేవికి ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, అలంకారం జరిగింది. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోదా కల్యాణం ఘనంగా జరిగింది.
- మాగుంటలేఅవుట్ వేంకటేశ్వరస్వామి ఆలయం, బాలాజీనగర్ సీతారామ మందిరంలో తదితర వైష్ణవ ఆలయాల్లో గోదా కల్యాణాలు కమనీయంగా జరిగాయి.

నెల్లూరురూరల్ : సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన మూలపేట బెస్త వారిపాళెంలోని మహాలక్ష్మి (రావిచెట్టు అమ్మవారు) అమ్మవారికి సోమవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. విశేష పూజలు, అలంకరణలతో అమ్మవారిని ముస్తాబు చేసి భక్తుల దర్శనార్థం ఉంచనున్నట్లు ఆలయ నిర్వాహకులు గొల్ల సుబ్బారావు, శేఖర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా భోగి సందర్భంగా ఆదివారం అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు.

- నగరంలోని మాగుంట లేఅవుట్‌లో తన నివాసం వద్ద రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు భోగి పండుగ నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున భోగి మంట వేశారు. ప్రజలందరికీ భోగి భోగభాగ్యాలు ఇవ్వాలని ఆకాక్షించారు.

నెల్లూరు(విద్య) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఆచార్య రాఘవాచార్యులు ప్రవచనాలతో సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా భోగి మంటలు వేసి గంగిరెద్దులతో ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘాల గవర్నర్ పీ.శ్రీనివాసులరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్.నసీర్ అహ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బారాయుడు, గౌరవాధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నలుబోలు బలరామయ్యనాయుడు, రాఘవరెడ్డి, మాగంటి ప్రసాద్, కొండూరు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వస్త్ర, అన్నదానం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 14 : శుభమస్తు ఫౌండేషన్, న్యూరాజ్యలక్ష్మి హాల్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శుభమస్తు అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవి ఒక ప్రకటనలో తెలిపారు. తమ తల్లిదండ్రులు స్వర్గీయ బయ్యా వెంకటరమణయ్య, సరోజ నమ్మల స్మరణార్థం నిర్వహిస్తున్నామని తెలిపారు.










బుచ్చి : జొన్నవాడలో కామాక్షితాయి గ్రామోత్సవం


వెంకటాచలం: అనికేపల్లిలో భోగి మంట వేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఉత్సాహంగా భోగి పండుగ

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి14: మండలంలో ఆదివారం వేకువజాము నుంచి భోగి మంటలు వేశారు.ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల ముంగిళ్లలో కళ్లాపు చల్లి రంగవల్లులు తీర్చిదిద్దారు. భోగి సందర్భంగా జొన్నవాడలోని గంగా, కామాక్షితాయి సమేత శ్రీమల్లికార్జునస్వామి గ్రామోత్సంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బుచ్చిలోని కోదండరామ స్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కన్యకారపరమేశ్వరి ఆలయాలు, బాబా మందిరాల్లో భక్తుల రద్దీ నెలకొంది. జొన్నవాడ, బుచ్చి, శ్రీరంగరాజపురం, దామరమడుగు తదితర గ్రామాల్లో యువతకు ఆటల పోటీలు నిర్వహించారు.

వెంకటాచలం: గ్రామాల్లో ప్రజలు ఆదివారం వేకువజామున భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని అనికేపల్లి, గొలగమూడి, కంటే పల్లి, చెముడుగుంట, కాకుటూరు, కసుమూరు, కనుపూరు, పాలిచెర్లపాడు, చవటపాళెం, వెంకటాచలం, తిక్కవరప్పాడు, సర్వేపల్లి, ఈదగాలి, ఇడిమేపల్లి, జంగాలపల్లి, నిడిగుంట పాళెం, గూడ్లూరు వారి పాళెం తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, తదితర ప్రాంతాల్లో యువకులు పెద్దఎత్తున భోగి మంటలు వేశారు. అనికేపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజాయాదవ్ అభి మానులు పెద్దఎత్తున భోగి మంటను వేశారు. అనంతరం సైకో పోవాలి.. సైకిల్ రావాలని నినాదాలు చేశారు.

సర్వేపల్లి ప్రజలు కాకాణిని ఇంటికి పంపించడం ఖాయం

వెంకటాచలం, జనవరి 14 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రాబోయేది టీడీపీ, జనసేనల ప్రజాప్రభుత్వమేనని, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సర్వేపల్లి ప్రజలు ఇంటికి పంపించడం ఖాయమని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. విజయ యాత్ర పేరిట సురేష్‌నాయుడు చేపట్టిన పాద యాత్ర ఆదివారం గొలగమూడి క్షేత్రం నుంచి బయలుదేరి కాకు టూరు పరిశ్రమల కేంద్రం వద్ద ఉన్న అడవిలోని శివాలయం, అక్కడి నుండి కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు చేరుకుంది. అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గుమినేని వాణీభ వాని, శ్రీహరి, కాకి శివకుమార్, ఆస్తోటి రవికుమార్, షేక్ రహీమ్, మస్తాన్, గిరీష్, పసుపులేటి మురళీ, వంశీ తదితరులున్నారు.

గంగమ్మకు ఘనంగా పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మనుబోలు, జనవరి 14: భోగి పండుగ సందర్భంగా స్థానిక గంగమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీర, పంచామృతాభి షేకాలు, కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించా రు. ఈ పూజా కార్యక్రమాలకు ఉభయ దాతలుగా గూడూరు పెంచలయ్య, జ్యోతి దంపతులు వ్యవహరించారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించి ఉభయదాతలు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విడవలూరు: మండలంలో విడవలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఊటుకురు పెద్దపాళెంలో కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకొని, ,చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 20 ఏళ్ల తరువాత వారంతా ఒకచోట చేరడంతో ఆ ప్రదేశం ఆహ్లాదకరంగా మారింది.అనంతరం సాగర తీరంలో సేద తీరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యేనేటి రాజేష్ గౌడ్, దద్దోలు ఉమామహేష్‌గౌడ్, కాకు మధుసూదన్ యాదవ్ , బీ అమృత్, చరణ్, మారం రాజా, సాగర్,కిరణ్, సుమన్, వినయ్, సుధాకర్, మనోజ్, సుదీర్, సందీప్, అశోక్ తదితరులు పాల్గొన్నారు














కేంద్ర పథకాలపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి గ్రామాల్లో ఆదివారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు, బీజేపీ నాయకులు కేంద్ర సంక్షేమ పథకాలు అయిన పీఎంఎంవీవై, పీఎం ఎస్ఎంఎ, జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే, ఆయుష్మాన్ భారత్, పీఎం ఉజ్వల యోజన పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రోన్ స్ప్రేయర్‌తో పంటలకు క్రిమిసంహారక మందుల పిచికారీపై కూడా అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ శివప్రియ, సీహెచ్‌వో సుబ్బమ్మ, పంచాయతీ అధికారి చలపతి, ఎంపీ టీసీ వినయ్‌నారాయణ, హౌసింగ్ ఏఈ పెంచలయ్య, క్రాంతి పథం సీసీ ఉమాదేవి పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు.




నారావారి పల్లెలో దీక్ష చేస్తున్న దామోదర నాయుడికి చంద్రబాబు సంఘీభావం

నారావారిపల్లెలో పండుగ సందడి

● చంద్రబాబు,లోకేశ్‌లకు స్వాగతం పలికేందుకు భారీఎత్తున తరలివచ్చిన టీడీపీ శ్రేణులు ● పార్టీ అధినేతలను కలిసిన పలువురు నాయకులు


నారావారిపల్లెలో స్వాగతం పలుకుతున్న ప్రజలకు చంద్రబాబు అభివాదం


హెలికాప్టర్ దిగుతున్న లోకేశ్

చంద్రగిరి, జనవరి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కుటుంబం రాకతో ఆయన స్వగ్రామమైన నారావారిపల్లెలో సందడి నెలకొంది.ఏటా సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులు,బంధువులతో కలిసి చంద్రబాబు స్వగ్రామానికి రావడం ఒక సంప్రదాయంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.ఈసారి చంద్రబాబు తన కుమారుడు లోకేశ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు హెలికాప్టర్‌లో ఎ.రంగంపేటకు చేరుకున్నారు. అక్క డ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్‌లో నారా వారిపల్లెలోని స్వగృహానికి 1.25 గంటలకు చంద్రబాబు,లోకేశ్ చేరుకున్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ,షాజహాన్ బాషా,టీడీపీ నాయకులు నరసింహయాదవ్, గాలి భానుప్రకాష్,కొల్లూరు ఇందుశేఖర్,హేమాం బరధర రావు, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, గురజాల జగన్మోహన్, సుబ్రమణ్యం నాయుడు, రవినాయుడు, కోడూరు బాలసుబ్రమణ్యం,గౌస్‌బాషా, కుమార రాజా రెడ్డి, శివకోటేశ్వరరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు చంద్రబాబు, లోకేష్‌లకు స్వాగతం పలికారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలంటూ నారావారిపల్లెలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న రైతు దామోదరనాయుడిని చంద్రబాబు పలకరించారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంట్లోకి వెళ్లిన చంద్రబాబు, లోకేశ్ సాయంత్రం 4గంటలకు బయటకు వచ్చారు.సాయంత్రం6 గంటల దాకా ఇంట్లోని తన చాంబర్‌లో పార్టీ నాయకులను కలిసి ఫొటోలు దిగారు.మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య,టీడీపీ నేతలు మురళీమోహన్, చక్రాల ఉష, చిట్టిబాబు నాయుడు తదితరులు చంద్రబాబును కలిసిన వారిలో వున్నారు. రాత్రి ఇంట్లో బంధువులకు, గ్రామస్తులకు విందు ఏర్పాటు చేశారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు కుటుంబ సభ్యులతో కలసి చంద్రబాబు, లోకేష్ గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు, కుల దైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం చంద్రబాబు తల్లితండ్రులైన ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు నివాళులర్పిస్తారు.తరువాత గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నారు.మధ్యాహ్నం తరువాత చంద్రబాబు, లోకేశ్ తిరుగు ప్రయాణం కానున్నారు.



తిరుమలలో భోగి సంబరాలు

తిరుమల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు భోగి పండుగను వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ మహద్వారం ముందు ఆలయ అధికారులు, సిబ్బంది భోగి మంటలు వేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు కూడా పాల్గొన్నారు.

అంగన్వాడీల సంతకాల సేకరణ

- భోగి పండుగ రోజూ రోడ్లపైనే


తిరుపతిలో సంతకాల సేకరణ

తిరుపతి (రవాణా), జనవరి 14 : చర్చలకు పిలిచి అవమానం చేస్తున్న ప్రభుత్వానికి సరైన గుణపాఠం నేర్పాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ జిల్లాలోని పలు అంగన్వాడీల దీక్షా శిబిరాల్లో ఆదివారం ప్రారంభమైంది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. తిరుపతిలో సంతకాల సేకరణ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పేవరకు కోటి సంతకాలే కాదు రెండు కోట్ల సంతకాలు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అంగన్వాడీల పోరాటాన్ని ప్రజా పోరాటంగా మారుస్తామని హెచ్చరించారు. గూడూరులో అంగన్వాడీ కార్యకర్తలు జగనన్నకు చెబుతాం.. అనే కార్యక్రమంతో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కోటలో దీక్షా శిబిరం వద్ద గొబ్బెమ్మలు ఆడి నిరసన తెలిపారు. వెంకటగిరి, సూళ్లూరుపేటలో భోగిపండుగ రోజున దీక్షలు కొనసాగించారు. నాయుడుపేటలో చెవిలో పూలు పెట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పండుగ పూట మట్టి తిని బతకాలా? జగనన్న అంటూ పుత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలు ప్లేటులో మట్టిపోసుకుని నిరసన తెలిపారు. పిచ్చాటూరులో పండుగను పక్కనపెట్టి దీక్షా శిబిరం వద్ద ముగ్గులు వేసి సమ్మెలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల ఉష, జనసేన నాయకులు చక్రధర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. గొబ్బియాలు తట్టి పాటలు పాడి నిరసన తెలిపారు. మహిళలు పండుగపూట కూడా రోడ్లో రోదిస్తుంటే జగన్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై ఆమె మండిపడ్డారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

కోట, జనవరి 14: మండల పరిధిలోని నెల్లూరుపల్లిలో కోడి పందెం స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు జరిపారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని ఏడు కోడి పుంజులు, రూ.6,650 నగదు స్వాధీనం చేసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

పెళ్లకూరు: చిల్లకూరు వడ్డిపాలెం సమీపంలోని కోడి పందేల స్థావరంపై ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, మూడు కోళ్లు, రూ.3900 నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

గూడూరు, జనవరి 14: మహిళల మెడలో బంగారు ఆభరణాలను లాక్కెళ్లే ఇద్దరు చైన్‌స్నాచర్లను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వేణుగోపాల రెడ్డి తెలిపారు. ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయుడుపేట మండలం పుదూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, అదే మండలం పూడేరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ముగ్గురూ కలిసి గూడూరు మండలం పరిధిలోని మధురెడ్డికాలనీలో గతేడాది ఆగస్టు 23వ తేదీన పద్మమ్మ అనే మహిళ తన ఇంటి ముందు నిలబడివుండగా మోటారు సైకిల్‌పై వెళ్లి మెడలోని ఆభరణాన్ని తెంచుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నిందితులైన అనిల్‌కుమార్, శ్రీనివాసులు మోటారుబైక్‌పై వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 8 చోరీ కేసులకు సంబంధించి రూ.9లక్షలు విలువచేసే 142 గ్రాముల బంగారు ఆభరణాలను, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు వెంకటేశ్వర్లు కోసం గాలిస్తున్నామని సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది ఆర్‌వీరాజు, విష్ణు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పండుగపూట పెనువిషాదం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల దుర్మరణం


రాంకీ, గౌతమ్, మునిరాజ (ఫైల్ ఫొటోలు)

దొరవారిసత్రం, జనవరి 14: దొరవారిసత్రంలో ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు దుర్మరణం పాలయ్యారు.పోలీసుల కథనం మేరకు.... దొరవారి సత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన కన్నలి గౌతమ్(23), పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన కోగిలి రాంకీ(24), నాయుడుపేట పట్టణం లోతువానిగుంట ప్రాంతానికి చెందిన కురుగొండ మునిరాజ(28) స్నేహితులు. వీరిలో రాంకీ, గౌతమ్ దగ్గర బంధువులు కూడా.శనివారం అర్థరాత్రి వరకు నాయుడుపేటలో భోగి సంబరాల్లో గడిపిన వీరు తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో బైకులో సూళ్లూరుపేటకు బయల్దేరారు. కలగుంట వంతెన వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు.ముగ్గురి తలలకూ బలమైన గాయాలు కావడంతో ప్రమాద స్థలంలోనే రాంకీ, గౌతమ్ చనిపోయారు. మునిరాజును పోలీసులు నాయుడుపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మద్యం మత్తు, దట్టమైన పొగ మంచు కారణంగా ముగ్గురు యువకులూ ప్రమాదం పాలైనట్లు పోలీసులు భావిస్తున్నారు.నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి లో పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాలను బంధువులకు పోలీసులు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు నాయుడుపేట ఆస్పత్రికి చేరుకోవడంతో విషాద వాతావరణం నెలకొంది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు


మృతుల బంధువుల రోదన

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

తృటిలో తప్పిన ప్రమాదం

వాకాడు, జనవరి 14: కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని తిరుమూరు ముట్టెంబాక రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. నెల్లూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు సంక్రాంతి పండుగకు వల్లమేడు గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఇంటికి కారులో బయలుదేరారు. ముట్టెంబాక వద్ద రోడ్డు తెగిపోయి ఉండటంతో గమనించి కారును వెనక్కి తిప్పుకుంటుండగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న యువకులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి నుంచి కారును ట్రాక్టర్ సహాయంలో రోడ్డు పైకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తిరుమూరు గ్రామస్తులు మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వరద ప్రవాహానికి రోడ్డు 30 మీటర్ల మేర కొట్టుకుపోయిందని, ఇప్పటి వరకు దానిని బాగు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడని..

వైసీపీ కార్యకర్త వరిపంట ధ్వంసం


ధ్వంసం చేసిన వరినాట్లను చూపుతున్న మునివర్ధన్‌రెడ్డి

పెళ్లకూరు, జనవరి 14: సోషల్ మీడియాతో పోస్టు పెట్టాడని పెళ్లకూరు మండలంలోని ఆర్లపాడుకు చెందిన మునివర్ధన్‌రెడ్డి పొలంలో వేసిన వరినాట్లును సొంత పార్టీ నేతలే పీకి వేయించారు. ఆదివారం బాధితుడు మీడియాతో మాట్లుడుతూ ఇటీవల సూళ్లూరుపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అని ప్రచారం జరిగిందన్నారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఈ దఫా టికెట్ ఇవ్వలేదన్న ఆనందంలో తాను మిఠాయిలు పంచడంతో పాటు సోషల్ మీడియాలో పోస్టుల పెట్టానని సొంత పార్టీ నేతలే అనుమానించారని, కక్ష కట్టిన ఓ వైసీపీ నేత అనుచరులు తన పొలంలో వేసిన వరినాట్లను పీకి వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారని చెప్పారు. తనకు ఇంత అన్యాయం జరిగినా వైసీపీలో ఉన్న ఏ నాయకుడు, ప్రజాప్రతినిధి అండగా నిలవలేదని వాపోయాడు.

నేత్రదానం

దొరవారిసత్రం, జనవరి 14: దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లిలో గ్రామానికి చెందిన దువ్వూరు కృష్ణారెడ్డి(85) మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ఆచార్య భర్వద్వాజా సేవా సంస్థ ఆధ్వర్యంలో సేకరించి చెన్నైలోని శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి అందజేశారు.

వివాహిత ఆత్మహత్య

గూడూరు, జనవరి 14: మండలంలోని పోటుపాళెం జాతీయ రహదారి సమీపంలో గల ఓ నివాసంలో శనివారం రాత్రి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.... పోటుపాళెం జాతీయ రహదారి సమీపంలో మధ్యప్రదేశ్‌కు చెందిన సుధాసాహు(20), కమలేష్‌సాహు దంపతులు నివసిస్తున్నారు. కమలేష్‌సాహు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనుల నిమిత్తం చెన్నైకు వెళ్లి శనివారం రాత్రి ఇంటికి వచ్చాడు. తన భార్య సుధాసాహు ఉరివేసుకుని మృతి చెంది ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి: పాశం


టీడీపీలో చేరిన వారితో పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 14: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండాగుంట గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపంచ గల సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. వైసీపీ పాలన నచ్చక కొండాగుంట గ్రామం నుంచి వైసీపీకి చెందిన 80 కుటుంబాలు మాజీ సర్పంచు శ్రీనివాసులరెడ్డి, మల్లారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, వాటంబేడు శివకుమార్, పెంచల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అమరేంద్ర, కృష్ణారెడ్డి, రమణయ్య, బాలయ్య, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణయుగ పాలనకు పట్టం కట్టండి: నెలవల


భోగిమంటలో జీవో ప్రతులను తగలబెడుతున్న నెలవల

నాయుడుపేట టౌన్, జనవరి 14: రాష్ట్రంలో స్వర్ణయుగ పాలనకు ప్రజలు పట్టం కట్టాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎదుట ఆదివారం వైసీపీ అనాలోచిత నిర్ణయాల జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నిరంకుశ పాలనకు విముక్తి కలిగి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని స్వర్ణయుగ పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో భీమవరం సర్పంచు అమృత సరళ, టీడీపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు అవధానం సుధీర్, బాబు, ముత్యాలయ్య, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టంతో

రైతులకు తీవ్ర అన్యాయం: సీపీఐ

గూడూరు, జనవరి 14: భూ యాజమాన్య హక్కు చట్టంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద భూ యాజమాన్య హక్కుచట్టం ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో భూ సమస్యలు పరిష్కరించుకునే అవకాశం న్యాయశాఖ పరిధిలో ఉండేవన్నారు. నూతన చట్టం ద్వారా రెవెన్యూ అధికారులే భూసమస్యలను పరిష్కరిస్తారని, దీనివల్ల భూస్వాములకు లాభం చేకూరుతుందన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, సీవీఆర్ కుమార్, నారాయణ, చంద్రయ్య, జమాలుల్లా, మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు బేబీకిట్ల అందజేత

గూడూరు, జనవరి 14: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆదివారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మురళీనాయుడు దాతృత్వంతో బాలింతలకు బేబీకిట్లు, పౌష్టికాహారం అందజేశారు.

యువతకు ఆదర్శం 'వేలూరు' సేవలు

- సేవాతత్పరుడిగా అందరిచేత ప్రశంసలు
- దళిత, గిరిజన కుటుంబాలలో వెలుగులు
- సమాజ సేవలో నేనుసైతం అంటున్న కళ్యాణ్‌రెడ్డి


యాచకులకు బిరియాని అందజేస్తున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి




వేలూరు కళ్యాణ్‌రెడ్డి - మోహన రూప రెడ్డి దంపతులను సత్కరిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు


గిరిజన విద్యార్థులకు దుస్తులు, విద్యాసామగ్రి అందిస్తున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి


ట్రాఫిక్ పోలీసులకు స్వీట్ బాక్సులు అందిస్తున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి


వేలూరు కళ్యాణ్‌రెడ్డిని అభినందిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

పెళ్లకూరు, జనవరి 14 : యువతకు ఆదర్శంగా .. సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శ ప్రాయులుగా కేఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత వేలూరు కళ్యాణ్‌రెడ్డి అందరిచేత ప్రశంసలు అందుకుంటున్నారు. దళిత, గిరిజన కుటుంబాలలో వెలుగులు నింపే విధంగా ఆయన తన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల ప్రదాతగా పేరు సంపాదించుకుంటున్నారు. తను ఎదుగుతూ ఎదుటివారి ఎదుగుదలను ఆకాంక్షించే మహోన్నత వ్యక్తిగా చిరుప్రాయంలోనే అందరి ఆశీర్వాదం అందుకుంటూ అడుగులు వేస్తున్న కళ్యాణ్‌రెడ్డి సేవలకు పలువురు ఫిదా అవుతున్నారు. తన సంపాదనలో పేదలకు పదిశాతం కేటాయింపు చేస్తూ నిరాశ, నిస్పృహలలో కొట్టుమిట్టాడుతున్న ఎన్నో పేద కుటుంబాల వారికి నేనున్నానంటూ భరోసా ఇస్తున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని చెప్పవచ్చు. తల్లిదండ్రులను కోల్పోయి..నా అనే వారు ఎవరూ లేక దిక్కులాలకిస్తున్న ఎంతోమంది పేద పిల్లలను అక్కున చేర్చుకుని వారి భవిష్యత్తు నాదే అంటూ ముందుకు రావడమే కాకుండా తన సేవల ద్వారా నిరూపించి చూపిస్తున్నారు. సమాజంలో అణగారిన వర్గాల పట్ల ఉన్న అసమానతలను చూసి అణగారిన కుటుంబాలలోని పిల్లల విద్యాభివృద్ధికి వేలూరు కళ్యాణ్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రధానంగా అక్షర జ్ఞానం లేకుండా చట్టాలపై అవగాహన లేని గిరిజన కుటుంబాలలోని పిల్లలను బడిబాట పట్టించి వారికి అన్ని విధాలుగా తోడై నిలుస్తున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి ఇటీవల ఎన్నో గిరిజన గ్రామాలలోని పాఠశాలల విద్యార్థులకు గొప్పగా తోడ్పాటు అందించడమే కాకుండా విద్యాభివృద్ధికి ఆయన అందించిన సహకారం ప్రశంసనీయంగా నిలుస్తోంది. పేద కుటుంబాల వారు ఉన్నతంగా చదివి శాస్త్రసాంకేతిక నిపుణులుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ సాధించి ఉన్నత స్థితికి చేరుకున్నప్పుడే సమాజంలోని పేదరికం, అసమానతలను రూపుమాప వచ్చునని గొప్పగా నమ్మే వేలూరు కళ్యాణ్‌రెడ్డి పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయి. కళ్యాణ్‌రెడ్డి సేవలను గుర్తించి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలు అన్న తారతమ్యం లేకుండా పేదరికమే ప్రమాణీకంగా ఆయన అందిస్తున్న సేవలు నేటి యువతకు గొప్ప ఆదర్శమని చెప్పవచ్చు.

కళ్యాణ్‌రెడ్డి సేవలకు ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రోత్సాహకం

ప్రజాసేవలో పరితపించే నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వారి సోదరులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యుల పట్ల అపారప్రేమ, అభిమానం పెంచుకున్న వేలూరు కళ్యాణ్‌రెడ్డి చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గుర్తించి తమ్ముడు నీ సేవల్లో నేను తోడ్పాటు అందిస్తా అంటూ ప్రోత్సాహకం అందిస్తున్నారు. వేలూరు కళ్యాణ్‌రెడ్డి అందించే సేవలకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారం అందించడంతో వేలూరు కళ్యాణ్‌రెడ్డి మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలో ఆయన అందిస్తున్న అనేక సేవా కార్యక్రమాలకు విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ పార్టీల నేతలు, వ్యాపారవేత్తలు, ముఖ్యంగా తాను పుట్టిన శిరసనంబేడు ప్రజానీకం కళ్యాణ్‌రెడ్డికి సలామ్ చేస్తూ సాగిపో యువక అంటూ అభినందనలతో ముంచెత్తుతున్నారు.